

భోరున కురుస్తున్న వర్షాన్ని ఏ మాత్రం లక్ష్యపెట్టకుండా ఈడుకుపోతున్న మెయిలుబండీ ఆడవాళ్ల మూడో తరగతి పెట్టెలో బెంచీ మీద వొకామె జేరబడి కాళ్లు రెండూ జాపుక్కూచుని దీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నది. ఆమె పేరు పద్మావతి. ఆమెకు పంతొమ్మిది సంవత్సరాలు. ఆమె మొహం విచారాన్ని సూచిస్తున్నది. కొంత సేపటికి ఆలోచిస్తున్న పద్మ రెండు కాళ్లూ లాక్కుని సరిగ్గా కూచుని మళ్లీ ఆలోచనలో పడ్డది!

పద్మావతి భర్తను విడిచిపెట్టి లేచివొస్తున్న మనిషి! అవాళ పొద్దున్న ఆమె ఇల్లు విడిచిపెట్టి వొచ్చి బండెక్కింది. చేతిలో చిన్నపర్సూ-పర్సులో మద్రాసుకు వొక టిక్కెట్టూ-కొంత చిల్లరా-యాభై రెండు రూపాయలూ వున్నయ్. ఆమె ఇంటి నుంచి తెచ్చిన డబ్బులో టిక్కెట్టూ అవీ కొనగా మిగిలిన డబ్బది. ఆ పెట్టెలో ఆమెకు హక్కున్న వస్తువు కూడా వొకటుంది-వొక చేతిసంచి. ఆ సంచిలో మూడు చీరెలూ, ఐదు జాకెట్లూ ఇంకేవో వున్నయ్.

ఐతే పద్మావతి లేచివొచ్చేసిందే కాని ఆమెకు మద్రాసులో ఎక్కడికి పోవడానికీ తెలీదు. నిజమే! తాను మద్రాసులో దిగుతుంది! సామాన్లు లేవు కాబట్టి కూలివాడి అవసరం లేదు. తను స్టేషన్‌లో టిక్కెట్టు ఇచ్చి బయటికొస్తుంది. బస్సులూ, ట్రాములూ బహుశా కనిపిస్తాయి. అవి ఎక్కడికి పోతాయో తనకు తెలీదు. మద్రాసులో మైలాపూర్ అనే భాగం వొకటుందని విన్నది. అక్కడికి పోతే? తెలుగువాళ్లు ఎవరన్నా వుంటే వాళ్లింట్లో తలదాచుకోవచ్చు. అన్నట్టు మద్రాసులో అంతా తమిళభాగోతమే నంటారు. ఎట్లా మరి?

ఆ పెట్టెలో ఇంకా ముగ్గురున్నారు. ఒకామె నిద్రపోతున్నది. ఇంకో ఆమె బెంచీ మీద పడుకుని ఐదు సంవత్సరాల క్రిందటి పత్రిక ఏదో చదువుతున్నది. మరొకావిడ బిడ్డకు పాలిస్తున్నది.

"చూడమ్మా-ఆ కిటికీ తలుపు కాస్త గట్టిగా వేసి పెడుదూ! పిల్లాడి మీదికి నీళ్లు తుళ్లుతున్నయ్" అన్నది బిడ్డకు పాలిస్తున్న ఆవిడ. పద్మావతి లేచి ఆ పని చేసింది. ఐనా, ఇంకా జల్లు వొస్తూనే వుంది.

"పోనీ అట్లా వుండనీ-నేనే జరుగుతాను... పాపిష్టి వర్షం!" అని ఆమె జరిగి కూర్చున్నది. పద్మావతి తన చోటుకు వెళ్లిపోయింది.

"ఏ వూరు వెళ్తున్నావమ్మా?" అన్నదావిడ.

వినపడనట్టు పద్మావతి వూరుకుంది. ఈ ప్రశ్న ఆమెకు చిరాకు పుట్టించింది. రైళ్లల్లో వెళ్తున్న అందరికీ ఇదే పాయ్యేకాలం-ఏ వూరు వెళ్లితే వాళ్ల కెందుకో-వాళ్లేమన్నా టిక్కెట్టు కొంటారా? ఆ వుళ్లో సదుపాయాలు చేస్తారా?

"అమ్మాయి-నిన్నే!" అన్నది ఆవిడ మళ్లీ.

"మద్రాసు."

"మద్రాసే!-వొక్కర్తెవా?"

# తొందరపాటు

## రావికొండలరావు

పద్మావతికి చటుక్కున మెదడు పనిచేసింది. "లేదు. మా ఆయన ప్రక్క పెట్టెలో వున్నారు. అక్కడ బొత్తిగా తొక్కిడిగా వుంటే-నన్ను ఇందులో ఎక్కించారు."

ఆవిడ "ఆహాఁ" అని "మాది కాకినాడ" అన్నది. ఈ మాట పద్మావతికి వినిపించలేదు. ఆవిడ మళ్లా ఆలోచనల్లో పడ్డది.

పద్మావతీ వాళ్లది స్థితిగల కుటుంబం. ఆమె తండ్రి భూస్వామి పల్లెటూర్లోనే వుంటాడు. ఆ గ్రామంలో వాళ్లకు పెద్ద భవనం లాంటి ఇల్లున్నది. భూములున్నయ్. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, పద్మావతి, చిన్నది అన్నపూర్ణ. వీళ్లిద్దరి కంటే పెద్దవాడు బాగా చదువుకుని దూరంగా వుద్యోగం చేస్తున్నాడు.

పద్మావతికి పదిహేడోఏట పెళ్లయింది. తర్వాత భర్తతో కాపరానికి వచ్చేసింది.

స్వతహాగా పద్మావతి చాలా మంచిది. ఆమెకు ఈ లేచిపోవటాలూ, ప్రేమవివాహాలూ అంటే మహ వొళ్లుమంట! పట్నంలో వుండి చదువుకోటానికి అవకాశం లేకా పల్లెటూళ్లో చదువుకు సదుపాయం లేకా ఆమె పెద్దగా చదువుకోలేదు. కాని చదివితే చక్కగా అలవరచుకునే తెలివితేటలున్నాయ్. ఇంటి దగ్గర వుండే తెలుగూ, ఇంగ్లీషూ చదువుకున్నది.

పద్మావతి భర్త కొద్దిగా కోపస్వభావం గల వాడు. కాని పద్మ అంటే ఎంతో అభిమానం ఏ నాడూ తిట్లు ఎరుగని పద్మ అప్పుడప్పుడు భర్త తిడుతూంటే సహించలేకపోయింది.

పెళ్లయిన తర్వాత అడపాదడపా పద్మ తండ్రి వాళ్ల కాపరం చూడొస్తూనే వున్నాడు. అప్పుడు కూడా ఆయనొచ్చాడు. ఆయన వచ్చిన మర్నాడు వీధిలోకెళ్లి ఇంటికి తిరిగొచ్చేసరికి పద్మను ఆమె భర్త కేకలు వేస్తున్నాడు.

"ఏమే-ఏం చేశావ్?" అన్నాడాయన గట్టిగా.

"ఏం లేదు. కాఫీలో పంచదార వెయ్యటం ఎక్కువైంది" అన్నది మొహం తుడుచుకుంటూ.

"అంతమాత్రానికే తిడతాడా? ఏం చేశావో చెప్పు!"

"అంత కంటే ఇంకేం చెయ్యలేదు" అన్నది.

ఈ మాట విని పద్మ భర్త ఛర్రున లేచాడు "ఇంకా ఏం చెయ్యాలే? అది చాలదూ? పూట పూటకూ ఏదో ఒక వంకర చెయ్యాలా? లక్షసార్లు చెప్పాను. అంత నిర్లక్ష్యం అయితే ఎట్లా భరించటం?"

"ఐతే చేసుకోండి" అన్నది.

"చూడండి మామగారూ-ఆ సమాధానం వినండి. ఇదే రోజూ భాగోతం. పొరపాటైపోయింది అని వూరుకోదు-ఎదురుమాటలు చెపుతుంది-నేను ఎంత బాధపడుతున్నానంటారు?"

అల్లుడి తప్పు ఏ మాత్రం లేదనీ-ఇదంతా కూతురి తప్పేననీ ఆయన గ్రహించి పద్మావతి మీద కేకలు వేశాడు. పద్మ గొల్లున ఏడ్చింది.

"ఎందుకింత నరకబాధ పెడతారు నన్ను? అమాంతం చంపెయ్యరాదూ?" అన్నది ఏడుస్తూ.

"నరకబాధ ఏం పెట్టారు నిన్ను? ఛస్తే చావు. పోతే ఫో!" అన్నాడు భర్త.

"అట్లాగే పోతాను" అన్నది.

"నోర్ముయ్!" అన్నాడు తండ్రి.

"పొమ్మనండీ-ఎక్కడికి పోతుందో-పోతుందట-పో ఫో!" అని తిట్టాడు భర్త. తండ్రి కూడా తిట్టాడు. ఆ రాత్రి వంట చెయ్యలేదు. పడుకుంది. వాళ్లు హోటల్లో తిన్నారు.

పద్మావతి వొకటి అనవలసింది 'తప్పైపోయింది-ఇక మీదట జాగర్తగా వుంటాను' అని, అని వుంటే-ఇంత గొడవ పెరగకపోను.

ఈ చిన్న విషయమే పద్మావతిని లేచిపోయేట్టు చేసింది. ఆ రాత్రంతా ఏదో ఆలోచించింది. రోజూ ఇక్కడ నరకయాతనే. ఈ కొంప విడిచేసి బయటపడితేనే కాని శాంతిలేదు అనుకున్నది. ఆ తెల్లారు జామునే కొంత డబ్బు తీసుకుని దొంగతనంగా బయల్దేరిపోయింది!

వర్షం పూర్తిగా తగ్గిపోయింది. కాని గాలి మాత్రం బయట జోరుగా వీస్తున్నది. మిగిలిన ఆడవాళ్లు రగ్గులు కప్పుకుని వెచ్చగా పడుకున్నారు. పద్మావతి వొక చీరె తీసి చుట్టూ కప్పుకుని ఆలోచిస్తున్నది. తను లేచిపోయి వచ్చేస్తున్నది. ఎందుకు? భర్త కోప్పడినందుకు పుట్టింటికి పోదామనుకుంది. కాని తండ్రి కూడా నానామాటలూ అని తిట్టాడు. తండ్రీ-భర్తా-లోకంలో చెప్పుకోదగ్గవాళ్లు. ఈ ఇద్దరూ తనకు వ్యతిరేకమైపోతే తనకు దిక్కెవరు? అందుకనే ఆ యింటిని విడిచిపెట్టేసింది!

పద్మావతికి నిద్ర రావడం లేదు. గుండె జల్లుమన్నది. ఇంత మాత్రానికి తను లేచిపోవాలా? తన భర్త-తనంటే ఎంత అభిమానం! తండ్రీ అంతే! మరి తను కాస్త జాగ్రత్తగా వుంటే ఈ గొడవ రాకపోను. మద్రాసు పోతుంది. పోతే మాత్రం ఎవరు తనను ఆదరిస్తారు? వొంటరిగా తను మాత్రం ఎక్కడ వుంటుంది? డబ్బు? వొంటరిగా తను ఆ పట్నంలో తిరుగుతూవుంటే ఏ వెధవన్నా చూసి తన వెంటపడితే?

పద్మ గుండెల్లో వొకసారి గుభేల్మని చప్పుడైంది. ఆ పట్నం అంతా అటువంటిదే నంటారు. తనకు ఏమిటి గతి? లేచిపోయిన మనిషని తన నోట్లో అందరూ గడ్డిపెడతారు! మొహం ఎత్తుకుని ఎట్లా తిరగటం? తప్పు తనది. కాఫీలో పంచదార జాగ్రత్తగా వేస్తే ఆ తిట్లు వుండకపోను-అంత చిన్న విషయం ఇంత పెద్దగా విషమించకపోను! వొకవేళ వేసినా 'ఇక మీదట జాగ్రత్తగా చూస్తాను' అంటే తీరిపోయేది. ఎంత మతిలేకపోయిందని తనకు?

పద్మావతి దిగ్గున లేచి కూచుని 'నేను తొందరపడ్డానా?" అని ప్రశ్నించుకుంది.

'అవును-తొందరపడ్డది, ఇటువంటి దెబ్బలాటలకు ఎవత్తన్నా లేచిపోతుందా? ఎంత అప్రతిష్ఠ?-

తనకూ, తన మూలంగా భర్తకూ, తండ్రికీ-వాళ్లు మళ్లీ లోకంలో తలెత్తుకు తిరగ్గలరా?'

పద్మావతికి ఈ ఆలోచనలు-సముద్రంలోని అలలలాగా వొకటీ వొకటీ లేస్తున్నయ్.

నిజంగానే ఈ విషయంలో తను తొందరపడిపోయింది. ఏమిటో ఆ సమయంలో అట్లా అనిపించింది గాని-ఈ విషయాలన్నీ తెలిసిరాలేదు? తన బ్రతుకు ఇంక కేవలం కుక్క కంటే అధ్వాన్నం!

పద్మావతి ఏడ్చింది. ఇంక ఏమిటి గత్యంతరం? తిరిగి ఇంటికి వెళ్లిపోవడం. అంత కంటె మంచిది మరి లేదు. వెళ్లి క్షమించమని ప్రాథేయపడితే తప్పక క్షమిస్తారు. తను ఇక మీదట జాగ్రత్తగా వుంటానంటుంది-వాళ్లు వింటారు. ఈ విషయాలు మొదటే తనకు తెలిస్తే?

మెయిలు బండి ఆగింది. కళ్లు తుడుచుకుని తలుపు తెరచి చూసింది. ఏదో స్టేషను. గాలి ఇంకా వీస్తున్నది. ఇక్కడ దిగబోయి రాత్రి వొచ్చే బండిలో తన వూరు వెళ్లి పోవచ్చు. చీరె మడతపెట్టి సంచీలో పెట్టుకుని-నెమ్మదిగా బండి దిగిపోయి-రాత్రి తన వూరికి పోయే బండి కోసం అక్కడ నిరీక్షిస్తున్నది పద్మావతి! ■

ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 9.9.1953 సంచికలో ప్రచురించాము